క్లుప్తంగా

టికెట్ ఉన్నవారే రండి..

ఖమ్మంక్రైం: ఇటీవల హైదరాబాద్‌లో సంధ్యా థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాట ఘటన దృష్ట్యా శుక్రవారం విడుదల కానున్న గేమ్ చేంజర్ సినిమాకు సంబంధించి ఉదయం 4 గంటలకు మొదలయ్యే బెనిఫిట్ షోకు టికెట్లు ఉన్నవారే రావాలని నగర ఏసీపీ రమణమూర్తి తెలిపారు. ఆన్‌లైన్ టికెట్లు లేకుండా సినిమా విడుదలయ్యే థియేటర్ల పరిసరాలకు ఎవరూ రావొద్దని, బాణాసంచా కాల్చడం నిషేధమన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని అన్నారు.

వేతనాలు చెల్లించాలి

కూసుమంచి: పెండింగ్ వేతనాలు చెల్లించాలని గురువారం మిషన్ భగీరథ ప్రాజెక్టు సబ్‌స్టేషన్ ఆపరేటర్లు హైదరాబాద్‌లో మిషన్ భగీరథ ప్రాజెక్టు ఇంజనీర్ ఇన్ చీఫ్ (ఈఎన్‌సీ)ను కలిసి వినతిపత్రం అందజేసినట్లు ఆపరేటర్ల యూనియన్ బాధ్యుడు శ్రీకాంత్ తెలిపారు. ఏజెన్సీ వేతన చట్టం ప్రకారం వేతనాలు ఇవ్వటం లేదని, ఈపీఎఫ్, ఈఎస్ఐ చెల్లించడం లేదని, ఇట్టి సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈమేరకు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

తల్లిపై కొడుకు దాడి..

- కేసు నమోదు

రఘునాథపాలెం: మండలంలోని ఎన్‌వీబంజర్‌లో తల్లిపై కుమారుడు దాడి చేసిన ఘటనపై గురువారం రఘునాథపాలెం స్టేషన్‌లో కేసు నమోదైంది. సీఐ ఉస్మాన్‌షరీఫ్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన జర్పుల సాల్కుకు ఆమె కొడుకు చిన్నాకు పొలం వద్ద బోరు నీరు వాడుకునే విషయంలో గురువారం ఘర్షణ జరిగింది. దీంతో ఆగ్రహంతో కొడుకు తల్లిపై దాడి చేయగా.. సాల్కు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

భూ పంచాయితీలో వ్యక్తికి తీవ్ర గాయాలు

నేలకొండపల్లి: మండలంలోని భూ పంచాయితీకి సంబంధించిన ఘర్షణలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం .. మండలంలోని సుర్దేపల్లి గ్రామంలో గురువారం పొలం గట్ల మధ్య జరిగిన పంచాయితీలో ఇరువర్గాలు వారు ఘర్షణ పడగా.. టి.నాగేశ్వరరావుకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో బాధితుడిని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

మాజీ ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు

కూసుమంచి/తిరుమలాయపాలెం: పాలేరు మాజీ ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి జన్మదిన వేడుకలను గురువారం కూసుమంచి, తిరుమలాయపాలెంలో బీఆర్‌ఎస్ నాయకులు, అభిమానులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు.

చెక్కుల పంపిణీ

ఖమ్మంవన్‌టౌన్: తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంపు కార్యాలయంలో ఖమ్మం రూరల్ మండలానికి చెందిన పలువురి లబ్ధిదారులకు మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డి అందజేశారు. మొత్తం 26 మంది లబ్ధిదారులకు రూ.6.69లక్షల విలువైన చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రూరల్ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో ప్రతిభ



ట్రోఫీ అందుకుంటున్న సందీప్

ఖమ్మం స్పోర్ట్స్: ఇటీవల నగరంలో జరిగిన జాతీయస్థాయి కరాటే పోటీల్లో ఖమ్మానికి చెందిన బుద్ధి సందీప్‌కు గ్రాండ్ చాంపియన్ సాధించాడు. ఇప్పటికే పలుమార్లు చాంపియన్‌గా నిలిచిన సందీప్ స్పారింగ్ అంశంలో తన సత్తా చాటి ట్రోఫీ గెలుచుకున్నారు. ఈమేరకు గురువారం కోచ్ గోపతి సైదులు అభినందనలు తెలిపారు.

కాంగ్రెస్‌లో చేరిక

ఖమ్మంవన్‌టౌన్: నగరంలోని డీసీసీ కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర నాయీ బ్రాహ్మణ సమైక్య సంక్షేమ సేవా కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గజ్జెల్లి వెంకన్న ఆధ్వర్యాన సంఘం నాయకులు గురువారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారికి ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ కుండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు, షేక్ రషీద్, దుబ్బాకుల వెంకటప్పయ్య తదితరులు పాల్గొన్నారు.

నియామకం

రఘునాథపాలెం: మండల బీజేపీ అధ్యక్షుడుగా మండలంలోని చిమ్మపుడికి చెందిన గుత్తా వంశీ నియమితులయ్యారు. చాలాఏళ్లుగా పార్టీలో కొనసాగిన ఆయన నియామకం పట్ల పలువురు వంశీకి అభినందలు తెలిపారు. ఈ సందర్భంగా పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని వంశీ అన్నారు.

పడకేసిన ప్రత్యేక పాలన..!

పల్లెలకు వెళ్లని ప్రత్యేకాధికారులు

- భారమంతా కార్యదర్శులపైనే..
- నిధుల లేమితో పనుల్లో జాప్యం
- సమన్వయ లోపంతో అభివృద్ధి అంతంతే

గ్రామ పంచాయతీల్లో ప్రస్తుతం ఏదైనా సమస్య ఉన్నప్పుడు ఎవరికి చెప్పుకోవాలో తెలియని పరిస్థితి నెలకొంది. సర్పంచ్‌ల పదవీకాలం ముగియడంతో గతేడాది ఫిబ్రవరి 1 నుంచి జీపీలకు ప్రత్యేకాధికారులను నియమించిన విషయం తెలిసిందే. అయితే వారు పల్లెల సమస్యలను పట్టించుకోకుండా వ్యవహరిస్తుండడంతో పల్లెల్లో పారిశుద్ధ్యం పడకేసింది. అంతా పంచాయతీ కార్యదర్శులపై భారం నెడుతూ చేతులు దులుపుకుంటున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. – నేలకొండపల్లి

కార్యదర్శులపైనే భారం..

పాలేరు నియోజకవర్గంలో 141 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. గతేడాది జనవరి 31 వరకు సర్పంచ్‌ల పాలన కొనసాగగా.. ఫిబ్రవరి 1 నుంచి ప్రత్యేకాధికారుల పాలన ప్రారంభమైంది. కాగా, సర్పంచ్‌ల పదవీ కాలం ముగిసిన తరువాత వారికి రావాల్సిన బిల్లులు రాకపోవడంతో వారూ గ్రామాల సమస్యల జోలికి వెళ్లడం లేదు. కాగా, జీపీలకు కేటాయించిన ప్రత్యేకాధికారులు ఏదైనా ప్రత్యేక కార్యక్రమం ఉంటే తప్పా ఆ గ్రామాల వైపు కన్నెత్తి చూడడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. అంతా పంచాయతీ కార్యదర్శులపైనే నెడుతుండడంతో ఎక్కడ గొంగళి అక్కడే అన్న చందంగా పారిశుద్ధ్యం అధ్వానంగా మారుతుంది.

నిధులు లేవు.. పనులు కాక..

ప్రత్యేకాధికారుల పాలనలో కేంద్రం నుంచి వచ్చే నిధులు రాకపోవడంతో రాష్ట్రం నుంచి వచ్చే గ్రాంట్ అంతంత మాత్రమే రావడంతో పాలన కష్టతరంగా మారిందని కార్యదర్శులు వాపోతున్నారు. కనీసం పంచాయతీ వర్కర్లకు వేతనాలు కూడా కష్టంగా మారింది. అంతేకాక మోటార్ల రిపేర్లు, వీధి దీపాల ఏర్పాట్లు, ట్రాక్టర్ డీజిల్ ఇతరాత్ర ఖర్చులకు నిధులు లేక ఇబ్బందులు తలెత్తుతున్నాయి.



కోనాయిగూడెంలోని ప్రధాన రహదారి

కొన్ని సందర్భాల్లో అప్పు చేసి మరి పనులు చేయించాల్సి వస్తుందని కొందరు కార్యదర్శులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అధికారుల సమన్వయ లోపం..

ప్రభుత్వ కార్యక్రమాలు విజయవంతం చేసేందుకు గ్రామస్థాయిలో ఉన్న అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాల్సి ఉంటుంది. కానీ అనేక గ్రామాల్లో సమన్వయ లోపం కనిపిస్తుంది. స్పెషల్ ఆఫీసర్లుగా ఉన్న మండల స్థాయి అధికారులు గ్రామాలకు రానప్పుడు తామేందుకు ఆరాటపడాలని వారు శ్రద్ధ చూపడం లేదు. దీంతో ఆయా గ్రామాల్లో పాలన కుంటుపడుతుంది. చాలా గ్రామాల్లో ప్రత్యేకాధికారులు ఎవరనేది కూడా తెలియని పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా స్పెషల్ ఆఫీసర్లు వారికి కేటాయించిన గ్రామాల్లో పర్యటించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

లక్ష్యం దిశగా పని చేయాలి



ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన ప్రత్యేకాధికారుల పాలన లక్ష్యానికి అనుగుణంగా అధికారులు పని చేయాలి. గ్రామానికి రోజూ ఒక్కసారైనా వెళ్లి వారి సమస్యలు తెలుసుకుని పరిష్కారం మార్గం చూపాలి.

– టి.సురేష్, సామాజిక కార్యకర్త, సింగారెడ్డిపాలెం

నిధులు లేకనే..



ప్రజలపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు. మొక్కుబడిగా ప్రత్యేకాధికారులను ఏర్పాటు చేసి చేతులు దులుపుకుంది. వారికి నిధులు లేకపోవడంతో గ్రామాల్లోకి వెళ్లలేకపోతున్నారు.నిధులు మంజూరు చేయాలి.

– కర్నాటి భానుప్రసాద్, సీపీఐ మండల కార్యదర్శి, నేలకొండపల్లి

గ్రామాలకు వెళ్లాల్సిందే..



ప్రతీ అధికారి స్పెషల్ అధికారిగా కేటాయించిన గ్రామాలకు కచ్చితంగా వెళ్లాల్సిందే. ఆయా పంచాయతీ కార్యదర్శులతో సమస్యలపై చర్చించి పరిష్కరించేలా చూడాలి. ఆ విధంగా మరోమారు ఆదేశాలు జారీ చేస్తాం.

– ఎం.యర్రయ్య, ఎంపీడీఓ

ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు

ఖమ్మంమామిళ్లగూడెం/ఖమ్మంలీగల్: సంక్రాంతి పండగను పురస్కరించుకొని గురువారం మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈనేపథ్యాన 57వ డివిజన్‌లో బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు రుద్రగాని మాధవ్‌గౌడ్ ఆధ్వర్యాన పోటీలు నిర్వహించి విజేతలకు మాజీ జిల్లా అధ్యక్షుడు సన్నె ఉదయ్‌ప్రతాప్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు వేల్పుల సుధాకర్, కనుమర్లపూడి ఉపేందర్, వక్కలంక సుబ్రహ్మణ్యం, దొడ్డా అరుణ, భవానీ, ఈశ్వర్ ప్రగడ లలిత, వెంకట్ గుప్త, లలిత సుబ్బారావు, జ్వాలా నరసింహారావు, జ్యోతుల యుగంధర్, దాసరి మధు, బూత్ అధ్యక్షులు సాయి, అఖిల్, ఉమా, పద్మ పాల్గొన్నారు. అలాగే ఖమ్మంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నేరెళ్ల శ్రీనివాసరావు ఆధ్వర్యాన మహిళా న్యాయవాదులకు పోటీలు నిర్వహించగా విజేతలకు న్యాయమూర్తులు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో న్యాయమూర్తులు కె.ఉమాదేవి, అపర్ణ, అర్చనాకుమారి, దీపా,మాధవి, ఆర్.శాంతిలత, శివరంజని, శీనయ్య, కల్పనా, కేవీ చంద్రశేఖర్, బార్ అసోసియేషన్ కార్యదర్శి చింతనిప్పు వెంకట్, తదితరులు పాల్గొన్నారు.

నేడు ఫ్రీడమ్ పార్కులో..

ఖమ్మంఅర్బన్: నగరంలోని గట్టయ్యసెంటర్ తెలంగాణ ఫ్రీడమ్‌పార్కులో నేడు(శుక్రవారం) ఎన్‌బీకే సేవా సమితి ఆధ్వర్యాన మహిళలకు ముగ్గుల పోటీ



బహుమతులు అందిస్తున్న ఉదయ్‌ప్రతాప్

లు నిర్వహిస్తున్నట్లు సమితీ బాధ్యుడు నల్లమల రంజిత్ ఒక ప్రకటనలో తెలిపారు. నందమూరి బాలకృష్ణ అభిమానుల ఆధ్వర్యంలో సాయంత్రం 4గంటలకు నిర్వహించే ఈ పోటీల్లో ప్రథమ బహుమతి రూ.5వేలు, ద్వితీయ రూ.2,500, తృతీయ రూ.1,500 అందించబడుతుందన్నారు.

రేపు కరుణగిరిలో..

ఖమ్మంరూరల్: మండలంలోని కరుణగిరి కేంద్రీయ విద్యాలయం సమీపాన ఉన్న గరికపాటి వెంకట్రావు ప్రాంగణంలో ఈ నెల 11న ఉదయం 10 గంటలకు ముగ్గుల పోటీలు నిర్వహించనున్నట్లు మంత్రి క్యాంప్ కార్యాలయ ఇన్‌చార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డి గురువారం తెలిపారు. ఎవరి ముగ్గులు వారే తెచ్చుకోవాలని, పోటీల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ బహుమతులు ఉంటాయని పేర్కొన్నారు.

ముందస్తు సంక్రాంతి సందడి

నేలకొండపల్లి: మండలంలోని సింగారెడ్డిపాలెం సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో గురువారం సంకాంత్రి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు విద్యార్థులపై భోగి పండ్లు పోసి దీవించారు. ఆటపాటలతో సందడి చేశారు. ప్రిన్సిపాల్ పద్మావతి, వైస్ ప్రిన్సిపాల్ రమాసుందరీ, సిబ్బంది పాకనాటి కన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



భోగి పండ్లు పోస్తూ విద్యార్థులను దీవిస్తున్న ఉపాధ్యాయులు

‘డబుల్’ ఇళ్ల పరిశీలన

నేలకొండపల్లి: అర్హులైన పేదలకు పంపిణీకి సిద్ధంగా ఉన్న డబుల్ బెడ్రూం ఇళ్లను ఆర్‌అండ్‌బీ పాలేరు సబ్ డివిజన్ డీఈఈ వెంకటరమణ గురువారం పరిశీలించారు. గ్రామంలో నిర్మించిన 18 ఇళ్లను మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చేతుల మీదుగా పంపిణీ చేసేందుకు చర్యలు చేపట్టారు. ఈనేపథ్యాన ఇళ్ల మధ్య ఉన్న చెత్తాచెదారం, దుమ్ము, ధూళి, జంగిల్ క్లియరెన్స్ పనులను చేయించడంతో పాటు ఇళ్లకు రంగులు వేయిస్తున్నారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

దుకాణాల వేలం

కూసుమంచి: మహా శివరాత్రిని పురస్కరించుకుని కూసుమంచిలోని శివాలయంలో ఏర్పాటు చేసే పలు దుకాణాల నిర్వహణ కోసం గురువారం ఆలయంలో వేలంపాట నిర్వహించారు. గత సంవత్సరం కంటే ఈసారి వేలం ద్వారా రూ.66,500 అదనపు ఆదాయం లభించింది. కాగా, బొంగుపేలాల దుకాణానికి వేలం ఖరారు కాలేదు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ రేలా ప్రదీప్‌రెడ్డి, దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ అనిల్‌కుమార్, ఈఓ శ్రీకాంత్, పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు.

పలువురికి జరిమానా

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలో ఖాళీ స్థలాలు, రోడ్లపై వ్యర్థాలు, భవన నిర్మాణ వ్యర్థాలు పోసిన వారికి కేఎంసీ అధికారులు జరిమానా విధించారు. 43వ డివిజన్ నెహ్రూనగర్ హెచ్‌పీ గ్యాస్ గోడౌన్ వద్ద ఖాళీ స్థలంలో చెత్త పోసిన స్థానికులకు రూ.2 వేలు, 12వ డివిజన్ గొల్లగూడెం రోడ్డులో భవన నిర్మాణ వ్యర్థాలను పోసిన వారికి రూ.2వేల జరిమానా విధించారు. జరిమానా విధించిన కేఎంసీ శానిటరీ సూపర్‌వైజర్ సాంబయ్య మాట్లాడుతూ.. మరోసారి ఇలా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.


సరిపడా ఎరువులు

కామేపల్లి: మండలంలోని పండితాపురం గ్రామం కొండాయిగూడెం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో రైతులకు యాసంగి సీజన్‌కు సరిపడా ఎరువులు అందుబాటులో ఉన్నాయని సొసైటీ చైర్మన్ ధనియాకుల హన్మంతరావు అన్నారు. గురువారం స్థానిక సొసైటీ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. పీఏసీఎస్ ఆధ్వర్యాన చివరి గింజ వరకు ధాన్యం కొనుగోలు చేస్తామని, ఇప్పటి వరకు ధాన్యం కొనుగోల్లు విజయవంతంగా చేపట్టామన్నారు. పాలకవర్గ సభ్యుల సహకారంతో సొసైటీని అన్ని రంగాల్లో ప్రథమ స్థానంలో నిలిపినట్లు తెలిపారు.

వైద్య శిబిరం విజయవంతం

నేలకొండపల్లి: మండలంలోని పైనంపల్లి టోల్ గేట్ వద్ద గురువారం నిర్వహించిన వైద్య శిబిరం విజయవంతమైంది. నేలకొండపల్లి పీహెచ్‌సీ ఆధ్వర్యాన ఉచిత వైద్య శిబిరం నిర్వహించగా.. జాతీయ రహదారి నిర్మాణ కార్మికులకు వివిధ రకాల పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హైవే ప్రాజెక్ట్ మేనేజర్ శ్రీనివాసరెడ్డి, వైద్యాధికారులు అర్జున్‌గౌతమ్, ఎస్.వెంకటరమణ, సీహెచ్‌ఓ శాంతిరాణి, హెచ్‌ఈఓ బి.వీరన్న, సూపర్‌వైజర్ స్వర్ణమాతబాయ్‌లతో పాటు నాగమణి, సుధారాణి, కవిత పాల్గొన్నారు.

హామీలు అమలు చేయాలి



క్యాలెండర్లు ఆవిష్కరిస్తున్న సంఘం నాయకులు

ఖమ్మంరూరల్: కాంగ్రెస్ ప్రభుత్వం గీత కార్మికులకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని గీతకార్మిక సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు మెరుగు సత్యనారాయణ, రాష్ట్ర కమిటీ సభ్యులు కొండం కరుణాకర్ అన్నారు. గురువారం మండలంలోని గోళ్లపాడులో సంఘం నూతన క్యాలెండర్లను ఆవిష్కరించిన సందర్భంగా వారు మాట్లాడారు. కల్లుగీత కార్మికులు ఐక్యంగా ఉండి సమస్యల పరిష్కారం కోసం ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఇదే వృత్తిని జీవనాధారంగా చేసుకుని జీవిస్తున్న కల్లుగీత కార్మికుల సంక్షేమం కోసం బడ్జెట్‌లో రూ.10వేలు కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. అర్హులందరికీ సేఫ్టీ మోకులు ఇవ్వాలని, ప్రతీ సొసైటీకి ఐదెకరాల భూమి ఇవ్వాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు మొక్క శేఖర్‌గౌడ్, తాళ్లపల్లి ఉపేందర్, జి.రమేష్, శ్రీను, ఆంజనేయులు, సత్యనారాయణ, టి.వెంకటేశ్వర్లు, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్లేట్లు, గ్లాసుల వితరణ

ఖమ్మంఅర్బన్: నగరంలోని 5వ డివిజన్ బాలాజీనగర్‌లోని రామాలయంలో భక్తులకు అన్నదానం నిర్వహించడానికి అవసరమయ్యే 100 భోజనం ప్లేట్లు, గ్లాసులను గురువారం వాసిరెడ్డి సేవా సమితీ ఆధ్వర్యాన అందించారు. ఈ సందర్భంగా అన్నదానం చేశారు. అనంతరం వితరణ చేసిన దాతలను ఆలయ కమిటీ సభ్యులు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ యల్లంపల్లి హన్మంతరావు, కమిటీ సభ్యులు గద్దె వెంకయ్య, జ్యోతి, సుహాసిని, సేవా సమితి సభ్యులు వాసిరెడ్డి సుబ్బారావు, రామసీత దంపతులు, వీరభద్రరావు, చక్రధరావు, ధనలక్ష్మి, రాధాకృష్ణ, శ్రీదేవి, అర్జున్‌రావు, నాగేశ్వరరావు, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

విద్యార్థులకు దుప్పట్లు..

ఖమ్మం మామిళ్లగూడెం: నగరంలోని ఎస్టీ హాస్టల్‌లో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యాన గురువారం దుప్పట్లతో పాటు మాస్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా చైర్మన్ డాక్టర్ వెలిగేటి చంద్రమోహన్ మాట్లాడుతూ.. ముదిగొండ గ్రామంలోని ఎస్టీ హాస్టల్‌లోనూ విద్యార్థులకు దుప్పట్లు, మాస్కులు పంపిణీ చేసినట్లు తెలిపారు. సెక్రటరీ సూర్యప్రకాశరావు, స్టేట్ కమిటీ మెంబర్ సాధినేని జనార్దన్‌రావు, కోశాధికారి గోవర్ధన్‌రావు, కేదాసు నరసయ్య, జల్లా వెంకటేశ్వర్లు, ఉపేందర్ రెడ్డి, తాత రాఘవయ్య, జి.నాగేశ్వరరావు, జి.వెంకటేశ్వర్లు, ఎం.శ్రీహరి, రమేష్, హాస్టల్ వార్డెన్‌లు, జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సింథటిక్ ట్రాక్ ఏర్పాటు చేయాలి

ఖమ్మం స్పోర్ట్స్: నగరంలోని సర్దార్‌పటేల్ స్టేడియంలో సింథటిక్ ట్రాక్ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్, మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యాన గురువారం రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు వినతి పత్రం అందజేశారు. వీలైనంత త్వరలో సింథటిక్ ట్రాక్ నిర్మాణానికి చర్యలు తీసుకుంటానని, జిల్లా కలెక్టర్‌తో మాట్లాడుతానని మంత్రి చెప్పారు. మంత్రికి కలిసిన వారిలో మాస్టర్స్ అథ్లెటిక్స అసోసియేషన్ కార్యదర్శి నున్నా రాధాకృష్ణ, సత్యనారాయణ, పుల్లయ్య, మందుల వెంకటేశ్వర్లు, శిక్షకులు ఎండీ గౌస్, క్రీడాకారులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

క్యాలెండర్ల ఆవిష్కరణ..

ఖమ్మంవన్‌టౌన్: ఖమ్మం నగర కాంగ్రెస్ పార్టీ ఓబీసీ సెల్ చైర్మన్ బాణాల లక్ష్మణ్ ఆధ్వర్యాన మంత్రి తుమ్మల ఫొటోతో ముద్రించిన నూతన సంవత్సర క్యాలెండర్లను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



ఖమ్మంవన్‌టౌన్: క్యాలెండర్లు ఆవిష్కరిస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

గురువారం తన క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి అభివృద్ధి చేసిన పనుల చాయాచిత్రాలతో క్యాలెండర్‌ను తీర్చిదిద్దడం అభినందనీయమని మంత్రి అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మానుకొండ రాధాకిషోర్, కమర్తపు మురళీ, ఇతర నాయకులు పాల్గొన్నారు.

గ్యారంటీ హక్కు చట్టం చేయాలని ధర్నా



ధర్నాలో మాట్లాడుతున్న గుర్రం అచ్చయ్య

ఖమ్మం మామిళ్లగూడెం: కనీస మద్దతు ధరలకు గ్యారంటీ హక్కు చట్టం చేయాలని ఐక్య రైతు సంఘం రాష్ట్ర నాయకులు గుర్రం అచ్చయ్య డిమాండ్ చేశారు. జనవరి 9న డిమాండ్ డేగా అఖిల భారత ఐక్య రైతు సంఘం(ఏఐయూకేఎస్) జాతీయస్థాయి పిలుపులో భాగంగా ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యాన గురువారం ఖమ్మం కలెక్టరేట్‌ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగాఐక్య రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఆవుల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. నిరాహార దీక్ష చేస్తున్న రైతు జగ్జీత్‌జిత్ దల్లేవాలకు ఏదైనా జరిగితే కేంద్ర ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి, ఉద్యమం నిర్వహిస్తున్న ఢిల్లీ రైతు నాయకులతో చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. అనంతరం ఏఓకు వినతిపత్రం అందజేశారు. రైతు సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్షుడు మలీదు నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ ధర్నాలో సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కోలేటి నాగేశ్వరరావు, ఉపాధ్యక్షులు కె. నాగేశ్వరరావు, కోశాధికారి కే.లక్ష్మణ్, జిల్లా నాయకులు పాశం అప్పారావు, గుగులోత్ తేజానాయక్, దరావత్ లక్ష్మణ్, భాస్కర్, మల్లయ్య, వెంకటేశ్వర్లు, నాగిరెడ్డి, జర్పులదేవల, వీరబాబు, సోములు తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంతాలపై శ్రద్ధ చూపండి

తిరుమలాయపాలెం: గ్రామీణ ప్రాంతాల ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలని తహసీల్దార్ పీవీ.రామకృష్ణ అన్నారు. గురువారం మండలంలోని బీరోలులోని హెల్త్ సబ్ సెంటర్‌ను పరిశీలించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది గ్రామాల్లో ప్రజలకు వచ్చే వ్యాధులను గుర్తించి ముందస్తు జాగ్రత్తలు పాటించేలా తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వసుంధర, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలుకు మంత్రుల ఇళ్లను ముట్టడిస్తాం

ఖమ్మంరూరల్: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన విధంగా భూమిలేని వ్యవసాయ కార్మికుల కుటుంబాలకు రూ.12వేలు తక్షణమే ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ప్రతాపనేని వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం మండలంలోని కామంచికల్‌లో జరిగిన సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నీ అమలు చేయకుంటే సంఘం ఆధ్వర్యాన మంత్రుల ఇళ్లను ముట్టడిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు నాగమణి, వెంకటనర్సయ్య, వీరమ్మ, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కృషి, పట్టుదలతో విజయాలు

ఖమ్మం సహకారనగర్: విద్యార్థులు కృషి, పట్టుదలతో ముందుకెళ్తేనే విజయాలు సొంతమవుతాయని అన్నం ఫౌండేషన్ చైర్మన్ అన్నం శ్రీనివాసరావు, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి కె.రవిబాబులు పేర్కొన్నారు. గురువారం నగరంలోని ఏఎస్ఆర్ శాంతినగర్ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు మోటివేషన్ తరగతులను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు పలు సూచనలు చేశారు. అనంతరం ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాసరావును సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గోవిందరావు, శాంతినగర్ పాఠశాలల హెచ్‌ఎంలు కృష్ణకుమారి, డాన్ బోస్కో, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

‘ఔట్ సోర్సింగ్ నియామకాల్లో అవకతవకలు’

ఖమ్మం మామిళ్లగూడెం: గిరిజన గురుకులాల్లో ఔట్ సోర్సింగ్ అక్రమ నియామకాలపై విచారణ జరిపించాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి టి.ప్రవీణ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం ఖమ్మం సుందరయ్య భవనంలో జిల్లా ఉపాధ్యక్షుడు సాయిశేషు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గిరిజన సంక్షేమ, విద్యాసంస్థల్లో ఎలాంటి నోటిఫికేషన్ ఇవ్వకుండా ఔట్ సోర్సింగ్ పేరుతో 40మందికి ఉద్యోగాలను మంజూరు చేస్తూ ఆర్‌సీ నంబర్ ఏ1/1217/2024 నవంబర్ 14న గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి పేరుతో నియామకాలు చేపట్టారని ఆరోపించారు. కాగా, ఉద్యోగాల్లో చేరిన వారికి ఏ ఖాత నుంచి వేతనం చెల్లించాలో తెలియక ప్రిన్సిపాళ్లు అయోమయంలో ఉన్నారన్నారు. ఈ సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు రాజు, నగర నాయకులు వినోద్, మనోజ్, త్రినాథ్, సాయి తదితరులు పాల్గొన్నారు.

ఫాతిమా షేక్ జయంతి

ఖమ్మం మామిళ్లగూడెం: భారతదేశ తొలి ముస్లిం మహిళ ఉపాధ్యాయులు, ప్రముఖ సంఘ సంస్కర్త ఫాతిమా షేక్ జయంతిని పురస్కరించుకుని గురువారం వీరనారీమణుల ఆశయ సాధన సమితి ఆధ్వర్యాన ఖమ్మం బీకేబజార్‌లో కేక్ కట్ ఘన నివాళులర్పించారు. తొలుత ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేసిన అనంతరం అధ్యక్షురాలు ఉపేంద్రబాయి, ప్రధాన కార్యదర్శి జ్యోతి, ఉపాధ్యక్షురాలు త్రివేణి, గౌరవ సలహాదారులు సుశీలబాయిలతో పాటు రావుల వెంకటేశ్వర్లు, భద్రూనాయక్, బత్తిన శ్రీనివాస్ మాట్లాడారు. మహిళలు సావిత్రిబాయి పూలేతో పాటు ఫాతిమా షేక్ ఆశయాలను కొనసాగించాలని పిలుపునిచ్చారు. సమితి కార్యదర్శి స్పందన అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో సమితి నాయకులు కవిత, ప్రమీల, భవాని, కృష్ణవేణి, సుజాత, ఝూన్సీ, అనిత, సంధ్య, కల్పన, జాన్ బీ, సుభద్ర, అనురాధ, నాగేంద్ర, విజయ, నాగేశ్వరరావు, జావేద్, రవీందర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో ఏసీడీపీఓ విచారణ

నేలకొండపల్లి: మండలంలోని పైనంపల్లి అంగన్‌వాడీ కేంద్రంపై వచ్చిన ఆరోపణల నేపథ్యాన ఏసీడీపీఓ కె.ఉదయ్‌శ్రీ గురువారం విచారణ చేపట్టారు. గత నెలలో అంగన్‌వాడీ టీచర్ నాగలక్ష్మి రోడ్డు ప్రమాదానికి గురై ఇంటి వద్ద ఉంటూ ఓ ఆయాను ప్రత్యేకంగా నియమించి కేంద్రం నిర్వహణ చేయిస్తుంది. ఈక్రమంలో పౌష్టికాహారం సక్రమంగా అందించడం లేదని, కేంద్రానికి రాకుండా ఇంటి వద్దే ఉంటున్నా ఐసీడీఎస్ అధికారులు వేతనం చెల్లించారని జిల్లా అధికారికి గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు గురువారం ఏసీడీపీఓ కేంద్రాన్ని రికార్డులను పరిశీలించడంతో పాటు పలువురిని విచారించి రిపోర్టును జిల్లా అధికారికి అందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ నాగమణి ఉన్నారు.

సమయపాలన తప్పనిసరి

ఖమ్మం మామిళ్లగూడెం: సమయపాలనతోనే విజయాలు సాధ్యమని గర్ల్స్ ఇస్లామిక్ ఆర్గనైజేషన్ ఖమ్మం రీజినల్ ఆర్గనైజర్ ఖదిజతుల్ కుబ్రా, కొత్తగూడెం రీజినల్ ఆర్గనైజర్ హఫ్సా మేహ్విన్, పట్టణ అధ్యక్షురాలు అస్కియ ఆసాఫ్‌లు అన్నారు. గురువారం జీఐఓ ఆధ్వర్యాన పట్టణంలోని మహిళా అధికారులు, విద్యావేత్తలు, డాక్టర్లు, లాయర్లను కలిసి 2025 డైరీ, క్యాలెండర్లను అందించిన సందర్భంగా వారు మాట్లాడారు. నైతిక విలువలు పెంపొందిస్తూ, సమాజ స్థాపన కోసం కులమత భేదం లేకుండా జీఐఓ పని చేస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో క్యాంపస్ ఆర్గనైజర్ మెహజుజా సిద్రా, మీడియా ఇన్‌చార్జ్ హఫ్సా, అఫ్రీన్ ఉల్ హక్, సుమయ్యా తదితరులు పాల్గొన్నారు.

‘స్నేహ హస్తాలు’ సేవలు అభినందనీయం

ఖమ్మం సహకారనగర్/ఖమ్మంరూరల్: స్నేహ హస్తాలు ఫౌండేషన్ సేవలు అభినందనీయమని అకాడమిక్ మానిటరింగ్ అధికారి(ఏఎంఓ) రవికుమార్ అన్నారు. గురువారం నగరంలోని జలగంనగర్ జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలోని విద్యార్థులకు ఫౌండేషన్ ఆధ్వర్యాన రెండు బీరువాలు, లైబ్రరీ పుస్తకాలు, పుస్తకాల ర్యాక్, సౌండ్ సిస్టంను అందించినట్లు తెలిపారు. అంతేకాక నయాబజార్ పాఠశాల, ఎంపీపీఎస్ రాజీవ్‌గృహకల్ప పాఠశాల, ఎంపీపీఎస్ తనికెళ్ల పాఠశాలలకు రూ.50వేల విలువైన సామగ్రిని అందించడం అభినందనీయమన్నారు. మున్నేరు వరదలో దెబ్బతిన్న పాఠశాలలకు సహకారం అందించటం ద్వారా విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు శ్యాంసన్, సుధారాణి, స్పందన, వి.రామ్మోహన్‌రావు, ఫౌండేషన్ బాధ్యులు కరముల్లాబాబు పాల్గొన్నారు.



జలగంనగర్ పాఠశాలకు బీరువాలు అందిస్తున్న ఫౌండేషన్ బాధ్యులు